
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 13 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.160	260	240
సూర్యాపేట	రూ.148	220	250
నల్లగొండ	రూ.140	250	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.8



బుద్ధవనం వద్ద ప్రపంచ సుందరీమణులు

సాగర తీరం.. తారాతోరణం

- సాగర్‌లో అందాల భామల సందడి
- విజయవిహార్ అతిథి గృహానికి 22 దేశాల పోటీదారులు
- బుద్ధుడికి కొవ్వొత్తులతో నివాళులర్పించిన ప్రపంచ సుందరులు
- బుద్ధ జయంతి రోజే బుద్ధవనం సందర్శించి మురిసిన తీరు

నల్లగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / నాగార్జున సాగర్: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే ఆసియన్ దేశాలకు చెందిన 22మంది ప్రతినిధులు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 4:45 గంటలకు నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ వారికి అదనపు కలెక్టర్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ స్వాగతం పలికారు. అనంతరం వారంతా నేరుగా అతిథి గృహం వెనుక ఉన్న సాగర్ జలాశయాన్ని సందర్శించారు. జలాశయం వ్యూ వచ్చేలా సెల్ఫీలు తీసుకున్నారు. మీడియా ప్రతినిధులకు చేతులు ఊపి సందడి చేశారు. అనంతరం తమకు కేటాయించిన గదుల్లోకి వెళ్లారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ఆసియా, ఓసియానా గ్రూప్-4 దేశాలైన ఇండియా, బంగ్లాదేశ్, కాంబోడియా, మయన్మార్, వియత్నాం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, జపాన్, కజకిస్తాన్, కిర్గిస్థాన్, లెబనాన్, మంగోలియా, నేపాల్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, శ్రీలంక, టర్కీ, చైనా, థాయ్‌లాండ్, ఆర్మేనియా దేశాలకు చెందిన సుందరీమణులు ఉన్నారు.

కృష్ణాతీరంలో ఫొటో షూట్

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహానికి వచ్చిన 22 మంది సుందరీమణులు సాయంత్రం 5:10 గంటల నుంచి 5:30 గంటల వరకు కృష్ణానది తీరంలో ప్రత్యేక ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. విజయవిహార్ అతిథి గృహం వెనకవైపున ఈ ఫొటో షూట్ జరిగింది. పలురకాల స్టిల్స్‌తో అందాల భామలు ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ మౌనిక తదితరులు ప్రపంచ సుందరిమణులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సాయంత్రం 6 గంటలకు విజయవిహార్ నుంచి బుద్ధవనానికి చేరుకున్నారు.

బుద్ధుడి యాదిలో....

ప్రపంచ సుందరి పోటీదారులు బుద్ధవనంలో అడుగడుగునా తన్మయం చెందారు. సాయంత్రం ఆరు గంటలకు బుద్ధవనానికి చేరుకున్న అందాల బామలకు నిర్వాహకులు బుద్ధ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో లంబాడ నృత్యాలతో ఆహ్వానించారు. అనంతరం బుద్ధుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ సుందరులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ధ్యాన మందిరం లో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా పర్యాట క శాఖ గైడ్ శివనాగిరెడ్డి బుద్ధవనం విశేషాలను వారికి వివరించారు. అనంతరం జాతక వనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, నల్లగొం డ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బాలునాయక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయ క్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఎస్పీ మౌనిక పాల్గొన్నారు.

నమస్తే.. తెలంగాణ.. జరూర్ ఆనా


సాగర్ విజయవిహార్‌కు సాయంత్రం చేరుకున్న సుందరీమణులు 'నమస్తే..తెలంగాణ జరూర్ ఆనా' అంటూ సందడి చేశారు. విజయవిహార్‌ను సందర్శించిన తర్వాత ఫొటో షూట్‌లో పాల్గొన తర్వాత వారు అభివాదాలు, నమస్కారాలు చేస్తూ పలకరించారు. నమస్తే.. గుడ్ ఈవినింగ్ అంటూ పలకరించారు. వరుసలో నిలబడి ఫొటోలు, వీడియోలకు ఫోజులిచ్చారు.

నీవే నా మిస్ వరల్డ్ అన్నారు నా భర్త



మిస్‌వరల్డ్ పోటీదారుల సాగర్ పర్యటనకు వస్తున్న నన్ను చూసి నా భర్త 'నీవే నా మిస్ వరల్డ్' అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. బుద్ధవనం ఒక ప్రత్యేకమైన బౌద్ధ ప్రదేశమని, అలాంటి ప్రదేశాన్ని బుద్ధపూర్ణిమ రోజు మీరంతా సందర్శించడం మరిచిపోలేని అనుభూతిని మిగులుస్తుందన్నారు. పోటీలు పూర్తయిన తర్వాత మీ దేశాల్లో ఆడపిల్లల కోసం, మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్



విద్యుద్దీపాల అలంకరణలో బుద్ధవనం

6



ప్రపంచ సుందరీమణులు పర్యటించనున్న భూదాన్‌పోచంపల్లిలోని రూరల్ టూరిజం సెంటర్

మీ రాక కోసం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో 15న మిస్ వరల్డ్ పోటీల భామల పర్యటన
- రెండు బృందాలుగా అందాలభామలు, ప్రతినిధులు
- సుందరీమణుల కోసం పోచంపల్లి ముస్తాబు
- భూదాన్‌పోచంపల్లిలో 'హ్యాండ్లూమ్ ఇక్కత్ థీమ్'!
- గుట్టలో దీపారాధన, ఆలయ సందర్శన
- ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

ప్రపంచ సుందరీమణుల రాకకోసం యాదాద్రి జిల్లాలోని ప్రపంచ పర్యాటక, చేనేత కళల గ్రామం భూదాన్‌పోచంపల్లి, ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట ముస్తాబవుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు అట్టహాసంగా ఈ నెల 10న ప్రారంభం కాగా 31 వరకు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో 120 దేశాల సుందరీమణులు పాల్గొంటుండగా, పెద్దసంఖ్యలో విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరందరినీ బృందాలుగా ఏర్పాటుచేసి రాష్ట్రంలోని ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 15న ఒక బృందం పోచంపల్లిని, మరో బృందం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని సందర్శించనుంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. 6

- (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి/ యాదగిరిగుట్ట)

తీరు మారేనా..?

- సామాన్యులను ఇబ్బంది పెడుతున్న రెవెన్యూ సిబ్బంది
- కొర్రీలు పెడుతూ అక్రమాలు
- ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్న కలెక్టర్



6

జిల్లాలో క్షేత్రస్థాయిలోని రెవెన్యూ యంత్రాంగం తీరు మారట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుల అర్జీలను పట్టించుకోక పోవడంతో పాటు కొర్రీల పెట్టి వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు హెచ్చరించినా వారు తీరు మార్చుకోవడం లేదని సమాచారం. ఇటీవల భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించిన నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే కొందరిపై కలెక్టర్ తేజస్ నందలాల్ ఇటీవల చర్యలు చేపట్టినప్పటికీ ఇతర సిబ్బందిలో మార్పు కానరావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూభారతి చట్టంతోనైనా మార్పు రావాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నరైనా పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఉద్యమ బాట పట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లకు పైనే బకాయిలు ఉన్నట్లు వారు చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలోని తాజా మాజీ సర్పంచులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ / నల్లగొండ టౌన్)



నిధులు విడుదల చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అప్పులపాలయ్యాం ఆదుకోరూ!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామపంచాయతీలకు నల్లగొండలో 844, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421, సూర్యాపేటలో 475 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మురికి కాల్వలు, వీధిలైట్లు, పైపులైన్ల లీకేజీలు, రోడ్ల శుభ్రత, పల్లె ప్రగతి, డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, క్రీడా మైదానాలు, పంచాయతీ భవనాలు తదితర పనులను సర్పంచులు సొంత డబ్బులతో చేపట్టారు. కానీ ఇప్పటివరకు ఆ బిల్లులకు మోక్షం లభించడం లేదు.

- ఉమ్మడి జిల్లాకు రావాల్సింది రూ.150 కోట్ల పైనే
- అప్పుల చేసి నాడు అభివృద్ధి పనులు
- వడ్డీలు కట్టలేక నేడు తిప్పలు
- దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతున్న మాజీ సర్పంచులు

అత్యధికంగా నల్లగొండ జిల్లాలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలు ఉండగా సుమారు రూ. 150 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.60 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.50 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.40 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి. వీటిని తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లో డిమాండ్ చేస్తున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో అవస్థలుపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులకు పెరుగుతున్న వడ్డీలు...

గ్రామపంచాయతీల ద్వారా చేపట్టిన వివిధరకాల పనుల బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. పదవీకాలం ముగిసినా బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నా బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంద ని సర్పంచులు వాపోతున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్థికంగా కుంగిపోయిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనలు ఉన్నాయి. మరోవైపు సర్పంచులు తెచ్చిన అప్పులకు వడ్డీలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దీంతో చేసేదేం లేక వారు పోరుబాట పట్టారు.

దశల వారీ ఆందోళనకు కార్యాచరణ...

లక్షల రూపాయల అప్పులు చేసి పలు అభివృద్ధి...

మిగతా 7వ పేజీలో...

ఇంధనం నిల్వ చేసుకోవాలి

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

నల్లగొండ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధనం నిల్వ చేసుకోవాలని, నోస్టాక్ బోర్డు పెట్టవద్దని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు పెట్రోల్ బంకులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్ బంకుల డిమాండ్ మేరకు చమురు సంస్థలు 24 గంటల లోపు లేదా 2 రోజులలోపే ఇంధనం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. అయితే పెట్రోల్ బంక్ యాజమాన్యం, నిర్వాహకుల ఉదాసీనత, నిస్తేజం వల్ల ఒక్కోసారి పెట్రోల్ బంకుల్లో ఇంధనం సమయానికి చేరక కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డు పెడుతున్నారని అన్నారు. పెట్రోల్ బంకుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నో స్టాక్ బోర్డు పెట్టే పరిస్థితి తలెత్తకుండా యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా అవుతున్న నేపథ్యంలో లారీలు, ట్రాక్టర్లకు ఇంధనం అవసరం ఉంటుంది. కాబట్టి బంకుల్లో ఇంధన నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచించారు.



నల్లగొండలో పెట్రోల్ బంక్‌లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న రఘునందన్

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ సహించే ప్రసక్తే లేదు

మర్రిగూడ: ధాన్యం కొనుగోళ్లలో దోపిడీకి పీపీసీ సెంటర్లు, రైస్ మిల్లర్లు స్వస్తి పలకాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి నిర్ణీత మొత్తం కన్నా అధిక పరిమాణంతో ఉన్న సంచులు కొన్ని రైస్ మిల్లులకు వెళ్తున్న క్రమంలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొందరు రైస్ మిల్లర్లు కాంటా ఎక్కువ చేసి తీసుకువస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని పట్టు పడుతున్నారన్న సమాచారం ఉందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి నిర్ణీత తేమ శాతం ఉండకపోవడం, తాలు, చెత్త వంటివి ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో రైస్ మిల్లుల వద్ద సకాలంలో దిగుమతి కావడం లేదని పేర్కొన్నారు. రైతులు నిబంధనల మేరకు ధాన్యాన్ని తీసుకువచ్చి ఇబ్బందులు పడకుండా ఉండాలని సూచించారు.

దోపిడీరహిత సమాజ కోసం పోరాడాలి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

చండూరురూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలబడి దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం పోరాటం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దోనిపాముల గ్రామంలో సోమవారం మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్నా పేదలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం విచారకరమన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించడానికి సీపీఐ సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో వారికి మద్దతు ఉన్న రాష్ట్రాలకు అధికంగా, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం సరైన పద్ధతి కాదని సూచించారు. జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చూపేందుకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు మండల సహాయ కార్యదర్శి యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు మాదగోని విజయలక్ష్మి, బరిగెల వెంకటేష్, నాయకులు రాములు, బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, బండమీది వెంకటేశం, సీహెచ్ ఊషయ్య, రమేష్ గంట, ఇరిగి సంజీవ, బోయపల్లి బిక్షమయ్య జంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

పాలీసెట్‌కు సర్వం సిద్ధం

ప్రిన్సిపాల్ సీహెచ్. నరసింహారావు

నల్లగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ - 2025 నిర్వహణ కోసం అధికారులు సర్వం సిద్ధంచేశారు. ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ సీహెచ్.నరసింహారావు తెలిపారు. నల్లగొండ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలీసెట్ కోసం జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 5203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 10గంటల వరకు చేరుకోవాలని 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రాలలోకి పంపించేది లేదని తెలిపారు. పాలిటెక్నిక్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్స్‌తో పాటు పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు, ఎరేజర్ తెచ్చుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల కుదింపు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

నల్లగొండ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు ప్రకారం ప్రతీ మండలంలో ఆరు ప్రాథమిక పాఠశాలను కుదించే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్‌ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టీ లింగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలికల ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన శేషు స్మారకసదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరకపోవడానికి గల కారణాలను విద్యా కమిషన్ శాస్త్రీయ పరిశోధన చేయలేదన్నారు. కారణాలను విశ్లేషించకుండా పాఠశాలలను మూస్తూ పోవడం పరిష్కారం కాదన్నారు. కేవలం విద్యారంగం నుంచి ప్రభుత్వం తప్పుకోవడం కోసం చేసే ప్రయత్నమే ఈ రిపోర్ట్ అని ఆయన విమర్శించారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏం సోమయ్య మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం కోసం నెలకు రూ.500 కోట్లు ఇస్తామని ఒప్పుకొని మాట తప్పడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లు మంజూరు చేయాలన్నారు. సదస్సుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా శాఖల అధ్యక్ష వర్గం బీ వెంకటేశం, పబ్బతి వెంకటేశ్వర్లు, ఎస్ లక్ష్మీనరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, ఎస్.భాస్కర్, ఉమ్మడి జిల్లా బాధ్యులు పీ.వెంకులు, కే.వేణు, ఏ.శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, ఏడుకొండలు, ఎండీ కుర్షీద్‌మియా, జగతి, బాల నరసయ్య, సత్తయ్య పాల్గొన్నారు.







చింతపల్లి మండలంలోని వెల్లంకి గెస్ట్‌హౌస్‌లో ఆగిన ప్రపంచ సుందరీమణులు



బుద్ధుని పాదాల వద్ద అంజలి ఘటిస్తున్న సుందరీమణులు

సాగర తీరం.. తారాతోరణం

సాగర్‌లో అందాల భామల సందడి

హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే ఆసియన్ దేశాలకు చెందిన 22మంది ప్రతినిధులు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంట కు ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 4:45 గంటల కు సాగర్‌లోని విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ వారికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ స్వాగతం పలికారు. అనంతరం వారంతా నేరుగా అతిథి గృహం వెనుక ఉన్న సాగర్ జలాశయాన్ని సందర్శించారు. మీడియా ప్రతినిధులకు చేతులు ఊపి సందడి చేశారు. అంతకుముందు చింతపల్లి మండలంలోని వెల్లంకి గెస్ట్‌హౌస్‌లో ఆగారు.

- (ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్, చింతపల్లి)





సెల్ఫీ..





జిల్లా కలెక్టర్, ఐజీ, ఎస్పీ, ఏఎస్పీ, ఇతర అధికారులతో సుందరీమణుల గ్రూప్ ఫొటో

తెలంగాణ సంస్కృతి గొప్పదనం గురించి చెప్పాలి



నాగార్జునసాగర్, మే 12(ఆంధ్రజ్యోతి): తెలగాణ సంస్కృతి గొప్పదనం గురించి మీ దేశాల్లో చెప్పాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన ప్రపంచ సుందరిమణులను ఉద్దేశించి మాట్లాడారు. బుద్ధవనాన్ని చూసిన మీరందరూ మీ కుటుంబ సభ్యులతో సందర్శించాలని కోరారు. తెలంగాణ సంస్కృతి గురించి తెలుసుకున్న మీరు ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు.

బుద్ధవనం భారతదేశ వారసత్వ సంపద



బుద్ధవనం భారతదేశ గొప్ప వారసత్వ సంపద అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిస్ వరల్డ్-2025 పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రానికి పేరుతెచ్చి పర్యాటక రంగంలో పెట్టుబడులు తీసుకరావాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమన్నారు.



● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన సాగర్‌లో ఇందిరాగాంధీ, నెహ్రూ వంటి గొప్ప నేతలు సాగర్‌కు వచ్చా రని గుర్తుచేశారు. ఎంతో బౌద్ధ చరిత్ర కలిగిన ఆచార్య నాగా ర్జునుడు నడియాడిన నేలపై బుద్ధవనాన్ని నిర్మించారన్నారు. ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాన్ని సుందరిమణులు సందర్శించడం అభినందనీయమన్నారు.

పోలీస్ వలయంలో సాగర్

దేశాలకు చెందిన సుందరీమణులు నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చిన సందర్భంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆధ్వర్యంలో 2వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సాగర్ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా భద్రత చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

15న యాదగిరిగుట్టకు అందాల భామలు

యాదగిరిగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే అందాల భామలు ఈ నెల 15న యాదగిరిక్షేత్ర పర్యటనకు రానున్నారు. కొండపైకి సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు షెడ్యూల్ ప్రకటించగా ఇక్కడకు చేరుకున్న అందాలభామలు ముందుగా అఖండ దీపారాధన చేసి, తూర్పురాజగోపురం నుంచి స్వర్ణ దివ్య విమాన రాజగోపురం దర్శించుకుని త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించగా, అదే మార్గంలోని క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి, ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకుంటారు. ఆ తర్వాత అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకుని అనంతరం ఉపాలయాల్లో అండాళ్ అమ్మవారు, ఆళ్వార్‌స్వాములను దర్శించుకుని గర్భాలయానికి అభిముఖంగా ఆశీర్వచనం పొందనున్నారు. అక్కడి నుంచి ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ పశ్చిమ రాజగోపురం ద్వారా ఆలయం వెలుపలకు వస్తారు. అనంతరం ఆలయ ప్రాకార మండపాలు, తిరువీధుల్లో పర్యటించి తిరుగు ప్రయాణమవుతారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఆల యం, పరిసరాలు పర్యటించారు. ప్రపంచ సుందరీమణుల పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

గట్టుప్పల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల పరిధిలోని వెలమకన్నె గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లపు మల్లేష్(37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పని ముగించుకొని ఇంటికి వచ్చి భోజనం చేసిన తర్వాత నిద్రించాడు. ఆదివారం ఉదయం మల్లేష్ ఎంతకీ లేకకపోవడంతో భార్య కేకలు వేసింది. ఇరుగు పొరుగు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మల్లేష్ ముఖంపై రక్తపు మరకలు ఉండడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. మల్లేష్ తల్లి వెంకటమ్మ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మల్లేష్ మృతిపై విచారణ చేస్తున్నారు. హత్య, ఆత్మహత్య అనే కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చండూరు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మల్లేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

1500 కేజీల నల్లబెల్లం, 120 కేజీల పటిక స్వాధీనం

దేవరకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. చందంపేట మండలం పోలేపల్లి, నేరేడుగొమ్ము మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించి బొలేరో వాహనంలో నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుకున్నారు. 1500 కేజీల నల్లబెల్లం, 120 కేజీల పటిక, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. బొలేరో వాహనంలో నల్లబెల్లం, పటిక, సారా తరలిస్తున్న కేతావత్ రేడ్యా, కేతావత్ శ్రీనులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో దేవరకొండ ఎక్సైజ్ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

మీ రాక కోసం..

● 15న పోచంపల్లికి మిస్ వరల్డ్-2025 పోటీదారులు ● టూరిజం పార్కులో ముమ్మరంగా ఏర్పాట్లు



టూరిజం సెంటర్‌లో అందంగా తీర్చిదిద్దిన మ్యూజియం

భూదాన్‌పోచంపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే ఆసియా దేశాలకు చెందిన ప్రతినిధులు బృందాలుగా ఏర్పడి తెలంగాణలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలను, చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతాలను, పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. తెలంగాణలోని సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి చూపించాలనే లక్ష్యంతో పలు చర్యలు తీసు కుంటోంది. ఇందులో భాగంగా వారు సోమవారం నాగార్జునసాగర్ బు ద్ధవనాన్ని సందర్శించారు. ఈనెల 15న యాదాద్రిభువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్టను సందర్శించనున్నారు. పర్యటించే అందాలభామల కోసం పోచంపల్లిని ముస్తాబు చేస్తున్నారు.

ఆకట్టుకునేలా.. హ్యాండ్లూమ్ ఇక్కత్ థీమ్

పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు పొంది, ఉత్తమ పర్యాటక గ్రామంగా యునెస్కో సంస్థచే అంతర్జాతీయ అవార్డు పొందిన భూదాన్ పోచంపల్లికి ఈ నెల 15న మిస్‌వరల్డ్ పోటీదారులు వస్తున్నారు. వీరి రాక కోసం స్థానిక రూరల్ టూరిజం పార్కులో ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. పర్యాటక శాఖ బస్సులో 25మంది సుందరీమణల బృందం సాయంత్రం 6 గంటలకు పోచంపల్లికి చేరుకుంటుంది. ఇక్కడ రెండు గంటలుపాటు గడిపి తిరిగి రాత్రి 8 గంటలకు హైదరాబాద్ వెళ్తారు. అడుగడుగునా ఇక్కత్ థీమ్ ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



భూదాన్‌పోచంపల్లిలోని రూరల్ టూరిజం కేంద్రం


పర్యటన సాగుతుందిలా...

- మిస్ వరల్డ్ పోటీదారులకు టూరిజం సెంటర్ ప్రధాన ద్వారం నుంచి లోపలి మ్యూజియం వరకు మహిళలు కోలాటాలతో స్వాగతం పలుకుతారు. వారికి బొట్టుపెట్టి, పూలమాలలు వేసి సత్కరిస్తారు.
- పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ లోపలి ద్వారం వద్ద ముగ్గుల్లో అలకంరించిన టెర్రాకోట్ కుండలను పరిశీలిస్తారు. లోపలి గచ్చు ప్రాంతంలో మెహందీ వేయడాన్ని తిలకిస్తారు. అందాలభామలు కోరితే వారికి కూడా మెహందీ చేస్తారు. లైవ్ మ్యూజికల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుండి మ్యూజియంలోకి వెళ్తారు.
- టూరిజం సెంటర్ మ్యూజియంలో లోపల ఏర్పాటు చేసిన చేనేత మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. ఇక్కడ రెండు చేనేత మగ్గాలను ఏర్పాటు చేశారు.
- అక్కడి నుంచి కాన్ఫరెన్స్ హాల్‌లో స్నాక్ రిఫ్రెష్‌మెంట్ పూర్తయి న వెంటనే అక్కడి ఉంచి మ్యూజియం బయటకు వస్తూ టూరిజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్లబండిని తిలకిస్తారు. ఇక్కడే కొందరు మహిళలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన బతుమ్మను పేర్చుతూ పాటలు పాడతారు.
- అక్కడి నుంచి హంపి థియేటర్ చేరుకుంటారు. వీఐపీలతో పాటు సుందరీమణులు అరగంట పాటు సాంస్కృతిక కార్యక్రమా లు తిలకిస్తారు. ఫ్యాషన్ డిజైనర్ స్వాతి రూపొందించిన ఇండో- వెస్టన్ ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్ నిర్వహించే ర్యాంప్ వాక్‌ను తిలకిస్తారు.
- తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, పోచంపల్లి ఇక్కత్ ప్రాముఖ్యతను ఏవీ ప్రదర్శనను సైతం తిలకిస్తారు. అవసరం అనుకుంటే మిస్ వరల్డ్ పోటీదారులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఫొటోలు కూడా దిగుతారు.
- పోచంపల్లి టూరిజం ప్రాంగణం ఇరువైపులా ప్రతిబింబించే గుడిసెల సెట్‌లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌ను పరిశీలిస్తారు. ఇక్కడ ఉన్న 10 చేనేత స్టాల్స్‌లో పోచంపల్లి ఇక్కత్ స్టాల్స్ ఏడు, మిగతావి గద్వాల్, సిద్దిపేట, గొల్లబామ, నారాయణపేట్ స్టాల్స్ ఏర్పాటు చేస్తారు.
- రూరల్ టూరిజం సెంటర్‌లోని మ్యూజియంలో లైవ్ డెమానిస్ట్రేషన్‌పై మగ్గంపై వస్త్ర తయారీని పరిశీలిస్తారు. అంతేగాక లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ ప్రక్రియలను చేనేత మహిళా కార్మికులు సుందరీమణులకు వివరిస్తారు.

తీరు మారేనా..?

రెవెన్యూ శాఖలో రైతుల భూములకు సంబంధించిన సమస్యలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. వాటి పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల భూసమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశించారు. భూసమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. డబ్బులిస్తేనే భూరికార్డులను సరి చేస్తామని రైతుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కొందరు రైతులు డబ్బులు ఇవ్వకపోవడంతో వారి రికార్డులను సరి చేయకుండా కావాలని జాప్యం చేశారని విమర్శలూ వచ్చాయి. బాధిత రైతులు అప్పట్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు లు చేశారు. ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేసినా కొంతమంది రెవెన్యూ అధికారుల తీరు మారడంలేదు.

- (ఆంధ్రజ్యోతి)- సూర్యాపేట(కలెక్టరేట్)



- అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై వేటు
- రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు
- అక్రమాలకు పాల్పడ్డ వారిపై కేసులు, సస్పెన్షన్లు
- ఉన్నతాధికారులు హెచ్చరించినా ఫలితం శూన్యం
- రెవెన్యూ అధికారుల్లో మార్పు వచ్చేనా

జిల్లాలోని కొంతమంది తహసీల్దార్లు మీ సేవ కేంద్రాల ఆపరేటర్లు, ధరణి ఆపరేటర్ల ద్వారా లంచాలు తీసుకుటున్నట్లు సమాచారం. భూరికార్డుల ప్రక్షాళన, సాదాబైనామా, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కొంతమంది అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పాస్ పుస్తకాల్లో ఇంటి పేర్లు తప్పడం, విస్తీర్ణంలో తప్పులు ఉండడం, పలువురికి హద్దులు సరిగా లేకపోవడం వల్ల సవరణ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. కొన్ని ఆన్‌లైన్‌లో కూడా తప్పులు నమోదవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కావాలనే డబ్బుకు ఆశపడిన రెవెన్యూ సిబ్బంది రికార్డులను తప్పుల తడకగా మార్చారు. దీని వలన గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా అనేకం ఉంటున్నాయి. భూరికార్డుల ప్రక్షాళనలో మిగిలిన పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని అమలుల్లోకి తీసుకురానుంది. ఇప్పటికే దీనిపై మండల స్థాయి, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. భూభారతి చట్టం అమలులోకి రాగానే రెవెన్యూ అధికారులు, సిబ్బంది భూ భాగోతాలు ఒక్కొక్కటిగా బహిర్గతం కానున్నాయి. అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేశారు. ఆయా మండలాల్లో ఇంకా అధికారులు, సిబ్బంది అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఎంతమందిపై వేటు పడుతుందో వేచి చూడాల్సి ఉంది.

సంఘటనలెన్నో..

జిల్లాలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బందిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ఇటీవల చర్యలు చేపట్టారు. భూరికార్డుల విషయంలో కొంతమంది రైతుల నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేయడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేశారు. హుజూర్‌నగర్ తహసీల్దార్ ఏకంగా ప్రభుత్వ భూమిని ధరణి ఆపరేటర్‌తో కలిసి కొంతమంది ఇతరుల పేర్ల మీదకి మార్చారు. దానికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. ఈ విషయం బయటకు తెలియడంతో అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్‌తో పాటు ధరణి ఆపరేటర్‌తో పాటు రెవెన్యూ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేశారు. దీంతో పాటు మోతె మండలంలోని రాఘవపురం, నామవరం రెవెన్యూ శివారులోని పలు సర్వే నెంబర్లలో భూమి లేనప్పటికి ఉన్నదాని కంటే అదనంగా రికార్డుల్లో నమోదు చేసి అక్రమంగా పాస్‌పుస్తకాలు జారీ చేసిన విషయంలో మోతె తహసీల్దార్‌తో పాటు డీటీ, ఇద్దరు ఆర్‌ఐలు, మీసేవ కేంద్రం నిర్వహకుడు, పలువురు రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ శివారులో వివాదంలో ఉన్న భూమికి సంబంధించి అక్రమంగా ఇతరుల పేరు నమోదు చేసిన విషయంలో విచారణ చేయించి బాధ్యులైన డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏకు సిఫారసు చేశారు. కొందరు తహసీల్దార్లు, ఆర్‌ఐలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోని ధరణి ఆపరేటర్లు దీర్ఘ కాలికంగా ఒకేచోట పనిచేస్తుండడంతో అవినీతి, అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని భావించి వారందరినీ బదిలీ చేశారు.

అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు



రైతుల భూసమస్యలకు సంబంధించి అవినీతి, అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు. ఇప్పటికే జిల్లాలో కొంత మంది రెవెన్యూ అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేశాం. పెండింగ్‌లో ఉన్న రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణను రూపొందించి పరిష్కరిస్తున్నాం. త్వరలో భూభారతి చట్టం అమలులోకి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. అధికారులు విధి నిర్వహణలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే క్షమించేది లేదు.

- తేజస్ నందలాల్ పవార్, సూర్యాపేట జిల్లా కలెక్టర్.

● చిట్టి గువ్వ.. నీటి సయ్యాట



వేసవితీవ్రతకు ప్రజలు బయటకి రావాలంటేనే జంకుతున్నారు. మూగజీవులు, పక్షులు నీటి కోసం ఆర్తితో చూస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా శివారులోని ఓ నీటి కుంట వద్ద పక్షులు దాహార్తిని తీర్చుకుంటూ ఉక్కపోతతో ఆ నీటిలో మునుగుతూ తేలుతూ ఉపశమనం పొందుతూ కనిపించాయి.
(ఆంధ్రజ్యోతి-స్టాఫ్ ఫొటోగ్రాఫర్-యాదాద్రి)

● జీవాలకు ఆహారం..చిన్నారులకు ఆటస్థలం



పచ్చని వర్ణంతో మెరిసిపోయే పంట పొలాలు, కోతల అనంతరం వరి కొయ్యలతో బోసిపోతాయి. పచ్చని పైరుగా ఉన్నప్పుడు మానసిక ఆనందాన్ని ఇవ్వడంతో పాటు భవిష్యత్‌లో తినే గింజను ఇస్తుంది. అదే పైరు ఎండి, కోతలు పూర్తయ్యాక తన స్వరూపాన్ని మార్చుకున్నా.. స్వభావాన్ని వదల్లేదు. వరికొయ్యలు మేకలు, గొర్రెలకు ఆహారం కాగా ఎండిన పొలం వేసవిలో చిన్నారుల ఆటపాటలకు నెలవై ఆనందాన్ని పంచుతోంది. నల్లగొండ శివారులోని ఎండిన పొలంలో మేస్తున్న జీవాలు. మరో పొలంలో క్రికెట్ ఆడుకుంటున్న చిన్నారులు

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- సమ్మె విరమించిన ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్



అసోసియేషన్ ప్రతినిధులతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కొన్ని నెలలుగా వాయిదా పడుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలపై సందిగ్ధం వీడింది. డిగ్రీ పరీక్షల నిర్వహణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై ప్రైవేట్ యాజమాన్యాల డిమాండ్లను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో బకాయిలు విడుదలకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో అసోసియేషన్ ప్రతినిధులతో జరిపిన చర్చలలో బకాయిల విడుదలకు సీఎం హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. దీంతో చర్చలు ముగిసిన వెంటనే సమ్మెను విరమిస్తున్నట్టు అసోసియేషన్ ప్రకటించింది. సమ్మె విరమణతో రెండు నెలలుగా వాయిదా పడుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. థియరీ పరీక్షల అనంతరం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. బకాయిల విడుదలకు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణ రెడ్డికి అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. విద్యార్థుల భవిష్యత్తు, బకాయిల విడుదలపై సీఎం, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌పై విశ్వాసంతో సమ్మెను విరమించి షెడ్యూల్ ప్రకారం సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అసోసియేషన్ సమ్మె విరమణ నిర్ణయంతో సెమిస్టర్ పరీక్షల కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరట లభించినట్టయింది.

● నల్లగొండ టౌన్ : ఈనెల 14 నుంచి సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఎంజీయూ సీవోఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గతంలో పొందిన హాల్‌టికెట్లు లేదా కొత్తగా హాల్ టికెట్లు తీసుకొని గానీ ఈ పరీక్షలకు హాజరుకావచ్చు అని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ ఆరవ సెమిస్టర్‌లో 8,487, నాలుగో సెమిస్టర్‌లో 8,660, రెండో సెమిస్టర్‌లో 10,408, ఒకటవ సెమిస్టర్‌లో 6,066, మూడో సెమిస్టర్‌లో 5,109, ఐదో సెమిస్టర్‌లో 4,171 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు.

సమాజ చలనానికి శేషువాక్యం నిదర్శనం



శేషువాక్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కస్తూరి ప్రభాకర్, తదితరులు

నాగార్జునసాగర్, మే 12(ఆంధ్రజ్యోతి) : సమాజ చలనానికి శేషువాక్యం నిదర్శనమని సమూహ సెక్యులర్ రైటర్ జిల్లా కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో దాసి సుదర్శన్ చిత్ర కళానిలయంలో చైర్మన్ మహేన్‌రాజు అధ్యక్షతన ప్రముఖ కవి శేషు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం ప్రైవేటీకరణతో మానవ విలువల విధ్వంసంతో భవిష్యత్ తరాలు నాశనం అవుతున్నాయన్నారు. అనంతరం శేషువాక్యం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్టూనిస్టు నర్సిం, పాండురంగారావు, కిరణ్మయి, స్వతంత్ర, శ్రీనివాస్, సమత ప్రసాద్, స్వతంత్రరావు, హరి, చక్రి పాల్గొన్నారు.

దాసి సుదర్శన్ స్మారక ట్రస్టు కమిటీ ఎన్నిక

సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన దాసి సుదర్శన్ స్మారక ట్రస్టు కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యూవీ మహారాజు, శాశ్వత అధ్యక్షురాలిగా స్వతంత్ర, సభ్యులుగా సమతా ప్రసాద్, రంగారావు, పాండురంగారావు, కిరణ్మయి, రేఖ, అజయ్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఎరుకల నాంచారమ్మ జాతర

భూదాన్‌పోచంపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో గల ఎరుకల నాంచారమ్మ జాతర సోమవారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరై అమ్మవారికి పూజలు చేశారు.జాతరలో కోలాటాలు, బోనాలు, డప్పుల వాయిద్యాల నడుమ వైభవంగా అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్, తెలంగాణ ప్రదేశ్ కుర్రు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కుతాడి భాస్కర్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, మాజీ సర్పంచు అందెల హరీష్, మాజీ ఎంపీటీసీ బందారపు సుమలత లక్ష్మన్ గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు భూషణంగౌడ్, తోట శ్రీనివాస్, తోట బాబు, కుతాడి మహేష్ పాల్గొన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లను తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు.



పిలాయిపల్లిలో ఎరుకల నాంచారమ్మ జాతరకు హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

శివకేశవులకు విశేష పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న ప్రధానార్చకుడు నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివపార్వతుల ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 41,59,565 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి చల్లా గుణరంజన్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని స్వయంభువులకు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ డైరెక్టర్, ఈవో ఎస్.వెంకట్రావు ఆధ్వర్యంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాన్ని అందజేశారు.



లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి చల్లా గుణరంజన్‌కు ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	513 అడుగులు
టీఎంసీలు	136.8190
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	634.00 అడుగులు
టీఎంసీలు	2.01
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	665.73 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	77.355 క్యూసెక్కులు

అప్పుల పాలయ్యాం ఆదుకోరూ!

(5వ పేజీ తరువాయి)

పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు బిల్లులు రాకపోవడంతో దశల వారీ ఆందోళనకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. అప్పు లు పెరిగి పోవడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్‌ను మాజీ ప్రజా ప్రతినిధులు కలిసారు. అదే విధంగా రాబోయే రోజుల ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ సైతం పెండింగ్ బిల్లులను కేటాయించడంలో జాప్యం చేయడంతో అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బిక్షాటన వంటి కార్యక్రమాలను చేపట్టి అప్పట్లో పెద్ద ఆందోళన చేశారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర దాటినా కూడా గత ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో మాజీ ప్రజాప్రతినిధులు తీవ్ర నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. అనేకమంది మాజీ సర్పంచులు పేదరికంలో ఉండి అభివృద్ధి పనుల కోసం పెద్దఎత్తున లక్షలాది వడ్డీలకు తెచ్చి సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులపాలయ్యారు. ప్రధానంగా గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు, సీసీ రోడ్లకు, డ్రైనేజీ నిర్మాణాలకు పెద్దఎత్తున బిల్లులు పెట్టి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.6లక్షలు బిల్లులు రావాలి



పారిశుధ్యం పనులతో పాటు పాటు పల్లె ప్రకృతి వనం, మోటార్ల మరమ్మతులు, పైప్ లైన్ లీకేజీలు వంటి పనులకు సంబంధించి రూ.6 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్ పదవి ముగిసే ఏడాది ముందు నుంచి బిల్లులు రాకుండా పోయాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేపట్టాం. ప్రభుత్వం ం స్పందించి బిల్లులు చెల్లించి మాజీ సర్పంచులను ఆదుకోవాలి. లేనట్లయితే మాజీ సర్పంచుల అప్పుల ఊబిలో నుంచి తేరుకోవడం కష్టంగా ఉంటుంది.

-దేశబోయిన మల్లమ్మ,
మాజీ సర్పంచ్ వెలిమినేడు, చిట్యాల

అప్పుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం. పల్లె ప్రగతి పనులతో పాటు డ్రైనేజీ పనులు, ఉపాధి పనులు, మిషన్ భగీరథ పనులు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాం. రూ. 15 లక్షల వరకు బిల్లులు రావల్సి ఉంది. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను మంజూరు చేసి మాజీ ప్రజా ప్రతినిధులను ఆదుకోవాలి. వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులను చేపట్టాం. ఆ వడ్డీలు చెల్లించి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తాజా మాజీ సర్పంచులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

-రొట్టెల రమేష్, తిప్పర్తి మాజీ సర్పంచ్

ఈటల రాజేందర్‌పై వ్యక్తిగత విమర్శలు తగదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): కులవర్గ రాజకీయం కాకుండా, న్యాయం, అభివృద్ధి కోసం మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ, ఈటల రాజేందర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈటెల రాజేందర్ చేసిన పోరాటం తెలంగాణ ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేక, ప్రజలకు సమాధానం ఇవ్వలేక ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. ఇది వారి అసహనం, భయాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. రాజేందర్‌పై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్‌రావు, పకీరు మోహన్‌రెడ్డి, పాలకూరి రవి, గడ్డం మహేష్, రావెళ్ల కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పరామర్శ



రంగమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం

మాడ్గులపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి తల్లి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్ నాయక్, నెల్లికంటి సత్యంతో కలిసి గ్రామానికి చేరుకొని రంగమ్మ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

దేవరకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలతో అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, జిల్లా సహాయకార్యదర్శి వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, నీల వెంకటయ్య, మల్లయ్య, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా అయోధ్యరెడ్డి



బోరెడ్డి అయోధ్యరెడ్డి

తుర్కపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా నియామితులయ్యారు. అయోధ్యరెడ్డితో పాటు మరో ముగ్గురిని రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్లుగా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించగా ప్రభుత్వం సోమవారం ఉత్త ర్వులు జారీ చేసింది. అయోధ్యరెడ్డి 15 నెలల పాటు 2023 డిసెంబరు 12 నుంచి 2025 మే 12 వరకు సీఎం సీపీఆర్‌వో గా పని చేశారు. ఆర్టీఐ కమిషనర్‌గా అయోధ్యరెడ్డి నియామకం కావడం పట్ల గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో థర్మల్ యూనిట్-1 ప్రారంభం



యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ

● **లోపాలను సవరించి ప్రారంభానికి సిద్ధం చేస్తున్న అధికారులు**

దామరచర్ల, మే 12, (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ యూనిట్-1ను ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద టీజీజెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలోని యూనిట్-1లోని లోపాలను సవరించి త్వరలో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒక్కో యూనిట్ 800 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం ఐదు యూనిట్ల ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. మొత్తం ఐదు యూనిట్లలో యూనిట్-2ను 2024 డిసెంబర్ 7న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కాగా యూనిట్-1 పనులు పూర్తయి పవర్ గ్రిడ్‌కు అనుసంధానంచేసి ట్రయల్ రన్ చేస్తున్న క్రమంలో గత నెల 28న ప్రమాదవశాత్తు ఆయిల్ పైపులైన్ లీకై మంటలు వ్యాపించి విద్యుత్ కేబుల్ నెట్‌వర్క్ దగ్ధమైంది. ఈ క్రమంలో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. తిరిగి రెండు రోజుల్లోనే సమస్యను పరిష్కరించి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ నెల చివరి వారంలో యూనిట్-1 ప్రారంభించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

తుది దశలో మరో మూడు యూనిట్లు

ఇప్పటికే యూనిట్-2 ఉత్పత్తి ప్రారంభం కాగా, యూనిట్-1 ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన 3,4,5 యూనిట్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఈఏడాది చివరి నాటికి మొత్తం 5యూనిట్ల ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు జెన్‌కో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చిన్నారులకు డ్రాయింగ్ పుస్తకాల పంపిణీ

నకిరేకల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వేసవిశిబిరంలోని చిన్నారులకు నల్లగొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నూనె జయవెంకటనారాయణ డ్రాయింగ్ పుస్తకాలను అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఆటపాటలతో సహా పాఠ్యాంశాలు నేర్పించి చిన్నారులను ఉపాధ్యాయులు ఉత్సాహపరుస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రకంటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ నియామకం

నకిరేకల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నూతన కమిటీని నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు తెలిపారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. మండల ప్రధాన కార్యదర్శులుగా ఉప్పల నాగరాజు, బండమీది శ్రీకాంత్, దొడ్డోని శంకర్, ఉపాధ్యక్షులు నాగరాజు, రాచకొండ వీరస్వామి, ధనలక్ష్మి, విక్రమ్‌రెడ్డి, కార్యదర్శులు యాదయ్య, రేణుక, నాగరాజు, అంజనేయులు, కోశాధికారిగా శేఖర్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు.

విన్నపాలు వినవలె



కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

'ప్రజావాణి'కి వెల్లువెత్తిన వినతులు

నల్లగొండ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారంవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెలువెత్తుతున్నాయి. పథకాల కోసం, ఇందిరమ్మ ఇళ్లు, తమ భూ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తమ తమ ఫిర్యాదులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌లకు అందజేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులను సేకరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందజేశారు.

ఎనిమిది నెలలుగా తిప్పించుకుంటున్నారు



నేను మా గ్రామ శివారులోని సర్వే నెంబ ర్ 738లో ఎకరం 7 గుంటల భూమిని కొనుగోలు చేశాను. ఆ భూమి మ్యుటేషన్ కోసం ఎనిమిది నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. నేటి కి కూడా నాకు డిజిటల్ పాస్ పుస్తకాలు మంజూరు కాలేదు. పాస్ పుస్తకాల కోసం స్థానిక అధికారులకు రూ.20 వేల వరకు అప్పగించారు. అయినా పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదు. అధికారులను ఎప్పుడు అడిగినా రేపు మాపు అంటున్నారే తప్ప పాస్ పుస్తకాలు మాత్రం ఇవ్వడం లేదు. దయచేసి విచారణ జరిపించి డిజిటల్ పాస్ పుస్తకాలు ఇప్పించండి.

\- పుట్ట పరమేష్, చందుపట్ల, నకిరేకల్

ఇల్లు ఇప్పించండి



నేను నిరుపేద కుటుంబానికి చెందిన వాడను. రెక్కాడితేగానే డొక్కాడని పరిస్థితి. నాకు గ్రామంలో చిన్న ఇల్లు ఉంది. అయితే ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. నాకు సొంతంగా ఇల్లు కట్టుకునే శక్తి లేదు. దీంతో పూరి గుడిసెలో నివసిస్తున్నాను. విద్యుత్ ప్రమాదం జరిగి ఇల్లు కాలిపోయినప్పుడు కూడా నాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు. దయచేసి ఇందిరమ్మ ఇళ్లలో ఇంటిని మంజూరు చేసి న్యాయం చేయండి.

\- ధనావత్ నాగు, బడాయి గడ్డ తండా, త్రిపురారం

ఇందిరమ్మ ఇల్లు కేటాయింపులో అవకతవకలు



నిరుపేద కుటుంబానికి చెందిన నేను 15 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాను. నాకు ఇంటి స్థలం ఉండటంతో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాను. వార్డు సభ అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలో లిస్ట్ ఒకటిలో నా పేరు వచ్చింది. ఇటీవల విడుదల చేసిన జాబితాలో మాత్రం నా పేరును లిస్ట్-3 లో చేర్చారు. దీంతో నేను అధికారులను సంప్రదించగా స్పందన లేదు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయి. వాస్తవానికి నాకు ఎలాంటి ఇల్లు, ఆస్తులు లేవు. నా భర్త కూలి పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దయచేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి అన్ని అర్హతలు ఉన్న తనకు న్యాయం చేయాలి.

\- షేక్ అన్వరున్నిసాబేగం, లైన్‌వాడ, నల్లగొండ

పింఛన్ ఇప్పించండి



నేను పుట్టుకతోనే మూగవాడిని. దివ్యాంగుల పింఛన్ కోసం ఆరు సంవత్సరాలుగా అధికారులు, కార్యాలయ చుట్టూ తిరుగుతున్నాను. అయినా ఫలితం లేదు. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు చేసిన తప్పిదం వల్ల పర్సంటేజీ తక్కువగా వేశారు. తిరిగి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించిన సాంకేతిక సమస్య వల్ల రెండోసారి రాదు అంటున్నారు. ఆరేళ్లుగా ప్రజాప్రతినిధులు అధికారులను కలిసి విన్నవిస్తూనే ఉన్నాను. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.

\- జగని రాము, తుమ్మలపెల్లి, చండూరు

న్యాయం చేయండి

మా గ్రామంలోని సర్వే నెంబర్ 378లో నాకు 2.12 గుంటల భూమి ఉంది. ఆ భూమిని ఎంతోకాలంగా సేద్యం చేసుకుంటూ మా కుటుంబం జీవనోపాధి పొందుతుంది. ప్రస్తుతం కూడా మేమే సేద్యం చేసుకుంటున్నాం. అయితే ఇటీవల వచ్చిన పాస్ పుస్తకాల్లో మా భూమి పొరపాటుగా ఎప్పుడో గ్రామం నుంచి వెళ్లిపోయిన వ్యక్తుల పేరిట నమోదైంది. అదేమిటని ప్రశ్నిస్తే స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కబ్జాలో ఉండి సేద్యం చేసుకుంటున్న తమ పేరు కాదని ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం ఊ రినుండి వెళ్లినవారి పేరిట పాస్ పుస్తకాలు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలి.



\- ఎంపాల శ్రీనివాస్, బీరెల్లిగూడెం, మునుగోడు

చెర్వుగట్టుపై వైభవంగా మాస కల్యాణం



చెర్వుగట్టుపై మాస కల్యాణం చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి తిథిని పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. మహామంటపంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు సురేష్‌శర్మ, సతీష్‌శర్మ వేదపండితుల మంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో పలువురు దంపతులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

గోపలాయపల్లిలో: గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో కూడా మాస కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయంలో యజ్ఞ మంటపం వద్ద నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఉత్సవంలో దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో నిర్మాణరంగ కార్మికులు పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంగూరి రాములు

నల్లగొండ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు ఈ నెల 20వ తేదీన చేపట్టిన సమ్మెలో పాల్గొని జయప్రదం చే యాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయు) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలో నిర్వహించిన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను మార్పు చేశారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నా యకులు అద్దంకి నర్సింహ, సైదాచారి, రవీందర్, వెంకటయ్య, రామకృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నాంపల్లి: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో ఆటోవర్కర్స్ యూనియన్ సీఐటీయూ డ్రైవర్లతో సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు ప్రమాదకరంగా ఉన్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు సుంకర గణేష్, కేతమల్ల మహేష్, సైదులు, వెంకటయ్య, ప్రవీణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు సహకరించాలి



కేతేపల్లిలో సిరిచందనను సన్మానిస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

కేతేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో 573 మార్కులతో టాపర్‌గా నిలిచిన అక్కెనపల్లి సిరిచందన ఉన్నత చదువులకు దాతలు సహకరించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు అల్లి అంజన్‌కుమార్ కోరారు. మండల కేంద్రం కేతేపల్లికి చెందిన సిరిచందనను ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకులంలో చదువుతూ మంచి మార్కులు సాధించిన ఆణిముత్యమని కొనియాడారు. పేదరికంలో మగ్గుతున్న సిరిచందనకు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, పి.సింహాద్రి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



హెచ్ఎంలకు పుస్తకాలు అందజేస్తున్న అందజేస్తున్న ఎంఈవో పద్మ

కనగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పుస్తకాలను ఎంఈవో పద్మ అందజేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసిందని పేర్కొన్నారు. పంపిణీ చేసిన పుస్తకాలను ఆయా పాఠశాలల్లో భద్రపరిచి వి ద్యార్థులకు సక్రమంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ థామసయ్య, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విజయ్, సంతోష్, రవీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధి

కనగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు పెన్నిధి అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి పెరిక అంజయ్య అన్నారు. మండలంలోని తిమ్మాజీగూడెం గ్రామానికి చెందిన నల్లబోతు గోపాల్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. వైద్య ఖర్చుల కోసం లక్షల్లో ఖర్చు చేశారు. ఈ మేరకు ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయనకు రూ.60వేల చెక్కు మంజూరు కాగా సోమవారం నిర్వహించిన సమావేశంలో చెక్కును గోపాల్ కుటుంబ సభ్యులకు అంజయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వం చెక్కులను మంజూర చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మందడి యాదగిరిరెడ్డి, పెరిక యాదగిరి, శంకర్, కోటేష్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన రాపోలు సుగుణమ్మ, నక్క అయోధ్యలకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ బింగి కొండయ్య, బింగి మహేష్, బెల్లి స్టాలిన్, చింత సునీల్, చింత విజయ్, చింత సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన సొడమ్మ జాతర



కేతేపల్లిలో సొడమ్మ ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కేతేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కేతేపల్లిలో సోమవారం యాదవుల ఆరాధ్య దైవం సొడమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. ప్రతీ రెండేళ్లకో సారి సొడమ్మ జాతరను యాదవులు నిర్వహిస్తారు. పండగను పురస్కరించుకుని యా దవులు అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో కుటుంబ సమేతంగా గ్రామ శివారులోని సొడమ్మ ఆలయం వద్దకు సామూహికంగా చేరుకున్నారు. అక్కడే బోనం వండి పసుపు, కుం కుమలతో అందంగా అలంకరించిన బోనం కుండలతో మహిళలు సొడమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని, తమ ఆరాధ్య దైవాన్ని కోరుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే సొడమ్మ తల్లికి భక్తులు గొర్రె, మేక పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు రక్తసిక్తమయ్యాయి. యాదవ యువతీ, యువకులు ఓ లింగా.... ఓ లింగా... అంటూ భేరీలు మోగిస్తూ కేరింతలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. జాతరకు ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా హాజరై సొడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మార్కెట్ ఛైర్‌పర్సన్ గుత్తా మంజుల, కేతేపల్లి మాజీ సర్పంచ్ జె.ముత్తమ్మ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కె.ప్రదీప్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దూదిమెట్ల బాలరాజుయాదవ్, ఎం.వెంకట్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, బీరం జాన్‌రెడ్డి, వి.అబ్బయ్య, జె.వెంకటనర్సయ్యయాదవ్, బి.ముత్తయ్య, సోమ లింగంయాదవ్, జె.సైదులు, జె. రవి, కె.రమేష్, పి.గంగయ్య, కె.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

సీపీఎం, బీజేపీ నాయకుల అరెస్ట్.. విడుదల



నల్లగొండ: టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి, నాయకురాళ్లు

కేతేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): అందాల పోటీలను నిరసిస్తూ హైదరాబాద్‌లో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు హాజరుకాకుండా ఉండేందుకు కేతేపల్లి పోలీసులు సోమవారం సీపీఎం, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఆయా పార్టీలు వేర్వేరుగా నిర్వహించే ఆందోళనలకు బయటి ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరుకాకుండా చూడటంలో భాగంగా ఆయా పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఆ తర్వాత వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన వెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, బీజేపీ జిల్లా నాయకురాలు ఎ.అనితగౌడ్, మండల ఉపాధ్యక్షురాలు ఎస్.విజయలక్ష్మి ఉన్నారు.

నల్లగొండలో ఐద్వా నాయకురాళ్లు...

నల్లగొండ రూరల్: అందాల పోటీలకు వ్యతిరేకంగా నాగార్జునసాగర్‌లో చేపట్టిన నిరసనకు వెళ్లకుండా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐద్వా నాయకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఉదయం వారి ఇంటి వద్ద ఉదయం అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి అందాల పోటీలు పూర్తిగా వ్యతిరేకమని అన్నారు. అందుకు వ్యతిరేకిస్తున్న ఐద్వా నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అరెస్టు అయిన వారిలో ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, కునుకుంట్ల ఉమారాణి ఉన్నారు.



కేతేపల్లి: పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

బీ.వెల్లెంలలో మహా శివలింగం స్థల వివాదం

- జలాభిషేకానికి గ్రామస్థుల యత్నం
- స్థలం నాదేనంటూ రైతు అభ్యంతరం

నార్కట్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): భారీ పరిమాణంలో ఏళ్ల తరబడి పూజలకు నోచుకోకుండా ఉన్న ఓ శివలింగానికి గ్రామస్థులు గుడి కట్టాలని సంకల్పించారు. సోమవారం ఆ శివలింగానికి జలాభిషేకం చేయాలని ప్రయత్నించారు. శివలింగం పడి ఉన్న స్థలం తనదని, ఆ స్థలంలో గుడి ఎలా కడతారని ఓ రైతు అభ్యంతరం తెలిపాడు. స్థలం ప్రభుత్వానిదేనని గ్రామస్థులు వాదిస్తున్నారు. విచారణ చేయాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల మధిర గ్రామమైన కొత్తగూడం శివారులో జరిగింది. గ్రామంలోని 170 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నెంబర్‌లో 1.34 గుంటల విస్తీర్ణంలో శివలింగానికి గుడి భూమి ఉండాల్సి ఉంది. ఈ సర్వే నెంబర్‌లో కొంత మేర బండ వ్యాపించి ఉంది. ఈ బండపైనే భారీ పరిమాణంలో ఉన్న శివలింగానికి గుడి కట్టాలని గ్రామస్థులు కొందరు సంకల్పించారు. ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న పట్టాభూమికి చెందిన కొందరు రైతులు సర్వే నెంబర్ 170లోని మహాశివలింగం ఉన్న బండ భూమిని ఆక్రమించారు. గ్రామస్థులు గుడి కట్టేందుకు పరిశీలించిన స్థలం ప్రభుత్వ భూమి కాదని తమదని అభ్యంతరం చెప్పారు. దీంతో సోమవారం జలాభిషేకం ఏర్పాట్లు చేయగా స్థల వివాదంతో రద్దు చేసుకున్నారు. ఈ స్థలంపై విచారణ చేసి గుడి కట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, ఎస్.కృష్ణ, కోటేశ్, రాములు, నవీన్, ధర్మారెడ్డి, వెంకన్న, యాదగిరి, నగేశ్, అశోక్ ఉన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మండల అధ్యక్షుడు అశోక్

చిట్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కా ర్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొంపెల్లి అశోక్ కోరారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మా ట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే జరిగిందన్నారు. బీసీల అభ్యున్నతికి స్వర్గీయ ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. తెలంగాణలో టీడీపీ పునర్వైభవానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నోముల వెంకటేష్, నూనె అంజిబాబు, వెలిమినేడు గ్రామశాఖ అధ్యక్షుడు సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక డివిజన్ అధ్యక్షుడిగా సురేష్‌యాదవ్



సురేష్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

నల్లగొండటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): యా దవ విద్యావంతుల వేది క నల్లగొండ డివిజన్ అ ధ్యక్షుడిగా గుండెబోయిన సురేష్‌యాదవ్ నియమితులయ్యారు. పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సమావేశంలో వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి నడ్డి బాలరాజుయాదవ్, పిల్లి రామరాజుయాదవ్, చీర పకంజ్‌యాదవ్, ఎల్‌వీ యాదవ్, బొబ్బలి గోపాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలనర్సింహస్వామి కల్యాణం

చిట్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలోని శ్రీలక్ష్మీఆండాళ్ సమేత బాలనర్సింహస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. కల్యాణానికి ముందు ఆలయంలో ఉత్సవమూర్తులకు అభిషేకాలు, గణపతిపూజ, స్వస్తివాచనం, ఎదుర్కోళ్లు, గరుడముద్ద కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, క్రెడాయ్ ప్రెసిడెంట్ గుమ్మి రాంరెడ్డి, గుమి వెంకటపాపిరెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇమ్మడి వెంకన్న, సభ్యులు నల్ల మహేందర్‌రెడ్డి, బెలిదె నర్మద, బూడిద లింగస్వామి, ఆమనగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

శాలిగౌరారం, మే 12 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో ఎండీ కరీం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇటుకులపాడు గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ కరీం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, ఫౌండేషన్ సభ్యులు బుడిగె శ్రీనివాసులు, డెంకల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ చంద్రకళ దశరథ, నాయకులు సైదులు, పాండు, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి...

మర్రిగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అజలాపురం గ్రామంలో ఓ పేదింటి ఆడపిల్ల పెళ్లికి గ్రామానికి చెందిన యువత ఆర్థికసాయం అందజేసింది. గ్రామానికి చెందిన వడ్త్యా నీలారవి దంపతుల కుమార్తెకు వివాహం కుదిరింది. ఈ నేపథ్యంలో గ్రామ యువత సహకారం ద్వారా అమ్మాయి పెళ్లి కానుకగా రూ. 7500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ నిరుపేద కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని, గ్రామంలో పేదంటి ఆడిపిల్లల పెళ్లికి భరోసా కల్పించాలన్నా లక్ష్యంతో ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెగావత్ చందునాయక్, రొక్కం భాస్కర్‌రెడ్డి, పందుల శ్రీను గౌడ్, వడ్త్యా రాజు, బిచ్చు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.160	260	240
సూర్యాపేట	రూ.148	220	250
నల్లగొండ	రూ.140	250	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.8



బుద్ధవనం వద్ద ప్రపంచ సుందరీమణులు

సాగర తీరం.. తారాతోరణం

» సాగర్‌లో అందాల భామల సందడి » విజయవిహార్ అతిథి గృహానికి 22 దేశాల పోటీదారులు

» బుద్ధుడికి కొవ్వొత్తులతో నివాళులర్పించిన ప్రపంచ సుందరులు » బుద్ధ జయంతి రోజే బుద్ధవనం సందర్శించి మురిసిన తీరు

నల్లగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / నాగార్జున సాగర్: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే ఆసియన్ దేశాలకు చెందిన 22మంది ప్రతినిధులు సోమవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేక బస్సులో బయలుదేరి సాయంత్రం 4:45 గంటలకు నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ వారికి అదనపు కలెక్టర్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ స్వాగతం పలికారు. అనంతరం వారంతా నేరుగా అతిథి గృహం వెనుక ఉన్న సాగర్ జలాశయాన్ని సందర్శించారు. జలాశయం వ్యూ వచ్చేలా సెల్ఫీలు తీసుకున్నారు. మీడియా ప్రతినిధులకు చేతులు ఊపి సందడి చేశారు. అనంతరం తమకు కేటాయించిన గదుల్లోకి వెళ్లారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ఆసియా, ఓసియానా గ్రూప్-4 దేశాలైన ఇండియా, బంగ్లాదేశ్, కాంబోడియా, మయన్మార్, వియత్నాం, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, జపాన్, కజకిస్తాన్, కిర్గిస్థాన్, లెబనాన్, మంగోలియా, నేపాల్, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, శ్రీలంక, టర్కీ, చైనా, థాయ్‌లాండ్, ఆర్మేనియా దేశాలకు చెందిన సుందరీమణులు ఉన్నారు.

కృష్ణాతీరంలో ఫొటో షూట్

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహానికి వచ్చిన 22 మంది సుందరీమణులు సాయంత్రం 5:10 గంటల నుంచి 5:30 గంటల వరకు కృష్ణానది తీరంలో ప్రత్యేక ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. విజయవిహార్ అతిథి గృహం వెనకవైపున ఈ ఫొటో షూట్ జరిగింది. పలురకాల స్టిల్స్‌తో అందాల భామలు ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ మౌనిక తదితరులు ప్రపంచ సుందరిమణులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సాయంత్రం 6 గంటలకు విజయవిహార్ నుంచి బుద్ధవనానికి చేరుకున్నారు.

బుద్ధుడి యాదిలో....

ప్రపంచ సుందరి పోటీదారులు బుద్ధవనంలో అడుగడుగునా తన్మయం చెందారు. సాయంత్రం ఆరు గంటలకు బుద్ధవనానికి చేరుకున్న అందాల బామలకు నిర్వాహకులు బుద్ధ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో లంబాడ నృత్యాలతో ఆహ్వానించారు. అనంతరం బుద్ధుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ సుందరులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ధ్యాన మందిరం లో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా పర్యాట క శాఖ గైడ్ శివ నాగిరెడ్డి బుద్ధవనం విశేషాలను వారికి వివరించారు. అనంతరం జాతక వనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, నల్లగొం డ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బాలునాయక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయ క్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఎస్పీ మౌనిక పాల్గొన్నారు.

నమస్తే.. తెలంగాణ.. జరూర్ ఆనా

సాగర్ విజయవిహార్‌కు సాయంత్రం చేరుకున్న సుందరీమణులు 'నమస్తే..తెలంగాణ జరూర్ ఆనా' అంటూ సందడి చేశారు. విజయవిహార్‌ను సందర్శించిన తర్వాత ఫొటో షూట్‌లో పాల్గొన తర్వాత వారు అబివాదాలు, నమస్కారాలు చేస్తూ పలకరించారు. నమస్తే.. గుడ్ ఈవినింగ్ అంటూ పలకరించారు. వరుసలో నిలబడి ఫొటోలు, వీడియోలకు ఫోజులిచ్చారు.

నీవే నా మిస్ వరల్డ్ అన్నారు నా భర్త



మిస్‌వరల్డ్ పోటీదారుల సాగర్ పర్యటనకు వస్తున్న నన్ను చూసి నా భర్త 'నీవే నా మిస్ వరల్డ్' అన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. బుద్ధవనం ఒక ప్రత్యేకమైన బౌద్ధ ప్రదేశమని, అలాంటి ప్రదేశాన్ని బుద్ధపూర్ణిమ రోజు మీరంతా సందర్శించడం మరిచిపోలేని అనుభూతిని మిగులుస్తుందన్నారు. పోటీలు పూర్తయిన తర్వాత మీ దేశాల్లో ఆడపిల్లల కోసం, మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇలా త్రిపాఠి, నల్లగొండ జిల్లా కలెక్టర్



విద్యుద్దీపాల అలంకరణలో బుద్ధవనం



ప్రపంచ సుందరీమణులు పర్యటించనున్న భూదాన్‌పోచంపల్లిలోని రూరల్ టూరిజం సెంటర్

మీ రాక కోసం

» యాదాద్రి భువనగిరి జిల్లాలో 15న మిస్ వరల్డ్ పోటీల భామల పర్యటన

» రెండు బృందాలుగా అందాలభామలు, ప్రతినిధులు

» సుందరీమణుల కోసం పోచంపల్లి ముస్తాబు

» భూదాన్‌పోచంపల్లిలో 'హ్యాండ్లూమ్ ఇక్కత్ థీమ్'!

» గుట్టలో దీపారాధన, ఆలయ సందర్శన

» ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

ప్రపంచ సుందరీమణుల రాకకోసం యాదాద్రి జిల్లాలోని ప్రపంచ పర్యాటక, చేనేత కళల గ్రామం భూదాన్‌పోచంపల్లి, ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట ముస్తాబవుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు అట్టహాసంగా ఈ నెల 10న ప్రారంభం కాగా 31 వరకు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో 120 దేశాల సుందరీమణులు పాల్గొంటుండగా, పెద్దసంఖ్యలో విదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరందరినీ బృందాలుగా ఏర్పాటుచేసి రాష్ట్రంలోని ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 15న ఒక బృందం పోచంపల్లిని, మరో బృందం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రాన్ని సందర్శించనుంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి/ యాదగిరిగుట్ట)

తీరు మారేనా..?

● సామాన్యులను ఇబ్బంది పెడుతున్న రెవెన్యూ సిబ్బంది

● కొర్రీలు పెడుతూ అక్రమాలు

● ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్న కలెక్టర్



జిల్లాలో క్షేత్రస్థాయిలోని రెవెన్యూ యంత్రాంగం తీరు మారట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుల అర్జీలను పట్టించుకోక పోవడంతో పాటు కొర్రీల పెట్టి వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు హెచ్చరించినా వారు తీరు మార్చుకోవడం లేదని సమాచారం. ఇటీవల భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించిన నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే కొందరిపై కలెక్టర్ తేజస్ నందలాల్ ఇటీవల చర్యలు చేపట్టినప్పటికీ ఇతర సిబ్బందిలో మార్పు కానరావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భూభారతి చట్టంతోనైనా మార్పు రావాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నరైనా పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఉద్యమ బాట పట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లకు పైనే బకాయిలు ఉన్నట్లు వారు చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలోని తాజా మాజీ సర్పంచులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతిపత్రం అందజేశారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ / నల్లగొండ టౌన్)



నిధులు విడుదల చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

అప్పులపాలయ్యాం ఆదుకోరూ!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామపంచాయతీలకు నల్లగొండలో 844, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421, సూర్యాపేటలో 475 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మురికి కాల్వలు, వీధిలైట్లు, పైపులైన్ల లీకేజీలు, రోడ్ల శుభ్రత, పల్లె ప్రగతి, డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, క్రీడా మైదానాలు, పంచాయతీ భవనాలు తదితర పనులను సర్పంచులు సొంత డబ్బులతో చేపట్టారు. కానీ ఇప్పటివరకు ఆ బిల్లులకు మోక్షం లభించడం లేదు.

» ఉమ్మడి జిల్లాకు రావాల్సింది రూ.150 కోట్ల పైనే

» అప్పుల చేసి నాడు అభివృద్ధి పనులు

» వడ్డీలు కట్టలేక నేడు తిప్పలు

» దశల వారీగా ఆందోళనకు సిద్ధమవుతున్న మాజీ సర్పంచులు

అత్యధికంగా నల్లగొండ జిల్లాలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామపంచాయతీలు ఉండగా సుమారు రూ. 150 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.60 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.50 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.40 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి. వీటిని తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లో డిమాండ్ చేస్తున్నారు. బిల్లులు పెండింగ్ ఉండడంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో అవస్థలుపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులకు పెరుగుతున్న వడ్డీలు...

గ్రామపంచాయతీల ద్వారా చేపట్టిన వివిధరకాల పనుల బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. పదవీకాలం ముగిసినా బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నా బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంద ని సర్పంచులు వాపోతున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్థికంగా కుంగిపోయిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనలు ఉన్నాయి. మరోవైపు సర్పంచులు తెచ్చిన అప్పులకు వడ్డీలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దీంతో చేసేదేం లేక వారు పోరుబాట పట్టారు.

దశల వారీ ఆందోళనకు కార్యాచరణ...

లక్షల రూపాయల అప్పులు చేసి పలు అభివృద్ధి...

మిగతా 7వ పేజీలో...

ఇంధనం నిల్వ చేసుకోవాలి

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

నల్లగొండ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధనం నిల్వ చేసుకోవాలని, నోస్టాక్ బోర్డు పెట్టవద్దని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు పెట్రోల్ బంకులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్ బంకుల డిమాండ్ మేరకు చమురు సంస్థలు 24 గంటల లోపు లేదా 2 రోజులలోపే ఇంధనం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. అయితే పెట్రోల్ బంక్ యాజమాన్యం, నిర్వాహకుల ఉదాసీనత, నిస్తేజం వల్ల ఒక్కోసారి పెట్రోల్ బంకుల్లో ఇంధనం సమయానికి చేరక కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డు పెడుతున్నారని అన్నారు. పెట్రోల్ బంకుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నో స్టాక్ బోర్డు పెట్టే పరిస్థితి తలెత్తకుండా యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా అవుతున్న నేపథ్యంలో లారీలు, ట్రాక్టర్లకు ఇంధనం అవసరం ఉంటుంది. కాబట్టి బంకుల్లో ఇంధన నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచించారు.



నల్లగొండలో పెట్రోల్ బంక్‌లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న రఘునందన్

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ సహించే ప్రసక్తే లేదు

మర్రిగూడ: ధాన్యం కొనుగోళ్లలో దోపిడీకి పీపీసీ సెంటర్లు, రైస్ మిల్లర్లు స్వస్తి పలకాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి నిర్ణీత మొత్తం కన్నా అధిక పరిమాణంతో ఉన్న సంచులు కొన్ని రైస్ మిల్లులకు వెళ్తున్న క్రమంలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొందరు రైస్ మిల్లర్లు కాంటా ఎక్కువ చేసి తీసుకువస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని పట్టు పడుతున్నారన్న సమాచారం ఉందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి నిర్ణీత తేమ శాతం ఉండకపోవడం, తాలు, చెత్త వంటివి ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో రైస్ మిల్లుల వద్ద సకాలంలో దిగుమతి కావడం లేదని పేర్కొన్నారు. రైతులు నిబంధనల మేరకు ధాన్యాన్ని తీసుకువచ్చి ఇబ్బందులు పడకుండా ఉండాలని సూచించారు.

దోపిడీరహిత సమాజ కోసం పోరాడాలి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

చండూరురూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలబడి దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం పోరాటం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దోనిపాముల గ్రామంలో సోమవారం మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్నా పేదలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం విచారకరమన్నారు. టెర్రరిజాన్ని అంతమొందించడానికి సీపీఐ సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో వారికి మద్దతు ఉన్న రాష్ట్రాలకు అధికంగా, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం సరైన పద్ధతి కాదని సూచించారు. జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చూపేందుకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు మండల సహాయ కార్యదర్శి యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు మాదగోని విజయలక్ష్మి, బరిగెల వెంకటేష్, నాయకులు రాములు, బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, బండమీది వెంకటేశం, సీహెచ్ ఊషయ్య, రమేష్ గంట, ఇరిగి సంజీవ, బోయపల్లి బిక్షమయ్య జంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

పాలీసెట్‌కు సర్వం సిద్ధం

ప్రిన్సిపాల్ సీహెచ్. నరసింహారావు

నల్లగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ - 2025 నిర్వహణ కోసం అధికారులు సర్వం సిద్ధంచేశారు. ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ సీహెచ్.నరసింహారావు తెలిపారు. నల్లగొండ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలీసెట్ కోసం జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 5203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఉదయం 10గంటల వరకు చేరుకోవాలని 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రాలలోకి పంపించేది లేదని తెలిపారు. పాలిటెక్నిక్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్స్‌తో పాటు పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు, ఎలేజర్ తెచ్చుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాలల కుదింపు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

నల్లగొండ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు ప్రకారం ప్రతీ మండలంలో ఆరు ప్రాథమిక పాఠశాలను కుదించే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్‌ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టీ లింగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలికల ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన శేషు స్మారకసదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరకపోవడానికి గల కారణాలను విద్యా కమిషన్ శాస్త్రీయ పరిశోధన చేయలేదన్నారు. కారణాలను విశ్లేషించకుండా పాఠశాలలను మూస్తూ పోవడం పరిష్కారం కాదన్నారు. కేవలం విద్యారంగం నుంచి ప్రభుత్వం తప్పుకోవడం కోసం చేసే ప్రయత్నమే ఈ రిపోర్ట్ అని ఆయన విమర్శించారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఏం సోమయ్య మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెన్షనర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం కోసం నెలకు రూ.500 కోట్లు ఇస్తామని ఒప్పుకొని మాట తప్పడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లు మంజూరు చేయాలన్నారు. సదస్సుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా శాఖల అధ్యక్ష వర్గం బీ వెంకటేశం, పబ్బతి వెంకటేశ్వర్లు, ఎన్ లక్ష్మీనరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, ఎన్.భాస్కర్, ఉమ్మడి జిల్లా బాధ్యులు పీ.వెంకులు, కే.వేణు, ఏ.శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, ఏడుకొండలు, ఎండీ కుర్షీద్‌మియా, జగతి, బాల నరసయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరచర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూనావత్‌తండా సబ్‌స్టేషన్ పరిధిలోని కొండ్రపోల్ ఫీడర్ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందునపలు గ్రామాలకు నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దుల్లా హబీబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

మిర్యాలగూడ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడు బంటుగిరి, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, నక్క రవిబాబు, మోదాల అశోక్, నాగుబండి జానాభాయి, వజ్రమ్మ, చంద్రకళ తదితరులను పట్టణ కార్యవర్గంలోకి తీసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దామరచర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు.మండలంలోని దిలావర్‌పూర్-కొత్తగూడెం వరకు రూ.9 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. దిలావర్‌పూర్ గ్రామం నుంచి వయా మిట్టగూడెం, కొత్తగూడెం గ్రామం వరకు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే త్వరలో ఇందిరమ్మ కాలనీ నుంచి దిలావ ర్‌పూర్ వరకు, మిర్యాలగూడ నుంచి వయా టీక్యాతండా, కొత్తపేట, గోన్యాతండా, కేజే ఆర్ కాలనీ, కెతావత్‌తండా, దిలావర్‌పూర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిరు పేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కులు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ నాయకులు

నిడమనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అమలు చేస్తున్న సీఎం సహాయనిధి నిరుపేద కుటుంబాలకు వరమని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు సోమవారం మార్కెట్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, ఆలంపల్లి మైసయ్య, ఆలంపల్లి కృష్ణ, కోట్ల సైదులు, బైరోజు రాజయ్య, చర్క శ్రీను, వీరేశం, అన్నెబోయిన లక్ష్మీనారాయణ, గంగాధర్, కొండారు చంద్రశేఖర్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

దేవరకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ నర్సు దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పలువురు నర్సులను సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. సీనియర్ నర్సులు ఇవామ్ జలినా, భాగ్యరాణిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, గండూరి లక్ష్మణ్, లింగంపల్లి మధు, ఖాదర్‌బాబా, శ్యాంసన్, పెద్దిరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఫెయిత్ బంజారా ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ మాట్లాడుతూ ఆశ్రమం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మదర్స్ డే మరుసటి రోజును ఆశ్రమంలో గ్రాండ్ మదర్స్‌డేగా నిర్వహించిన అనంతరం చిన్నారులకు డ్రెస్సులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, సంధ్యారాణి, రూత్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేదీ !



వింజమూర్ నుంచి చింతపల్లికి వెళ్లే దారిలో ఉన్న మూల మలుపు

» వెంకటేశ్వరనగర్(మాల్)నుంచి సాగర్ వరకు ప్రమాదకరంగా మూల మలుపులు

» కనిపించని సూచిక బోర్డులు,వేగ నియంత్రికలు

హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర ప్రధాన రహదారి గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)నుంచి సాగర్ వరకు రహదారి పూర్తిగా మూలమలుపులతో ప్రమాదకరంగా ఉంది. దీంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వలయితే మూల మలుపుల వద్ద సూచికలు, రేడియం స్టిక్కర్లు లేకపోవడం, గ్రామాలకు సమీపంలో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలుచోటు చేసుకుంటున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ప్రధాన రహదారులైన వింజమూర్-నుంచి చింతపల్లితో పాటు నసర్లపల్లి, వెంకటంపేటగేట్ వద్ద మలుపులు అత్యంత ప్రమాదకరంగా మలుపులు దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు చింతపల్లిలో సాగర్-హైదరాబాద్‌పై జరిగిన ప్రమాదాల్లో 10 మంది మృతి చెందారు. ఎక్కువగా ప్రమాదాలు మలుపుల్లోనే జరిగాయి. పోలేపల్లిరాంనగర్ సమీపంలో ఇటీవల కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. తిరుగండ్లపల్లి మాజీ సర్పంచ్‌ను కారు బలంగా ఢీ కొన డంతో దుర్మరణం చెందాడు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదు.

మలుపులు చోట ప్రమాదం..

మాల్ నుంచి పోలేపల్లిరాంనగర్‌కు వెళ్లే దారిలో, మదనాపురం నుంచి కుర్మేడ్‌గేట్ సమీపంలో, విరాట్ నగర్ కాలనీ నుంచి వింజమూర్‌గేట్, చింతపల్లి నుంచి నసర్లపల్లి గేట్ సమీపాల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మలుపుల వద్ద సూచికలతో పాటు వేగ నియంత్రికలు ఏర్పా టు చేసి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల చింతపల్లి ఎస్ఐ యాదయ్య నేతృత్వంలో మాల్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన కూడా కల్పించారు.



నసర్లపల్లి గేట్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

అధికారులు స్పందించాలి



సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. మూల మలుపుల వద్ద వేగ నియంత్రికలు, సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరు గుతున్నాయి.

- బాదేపల్లి పులిరాజ్ గౌడ్(వీ.టీ.నగర్).

ప్రమాద నివారణకు చర్యలు తీసుకుంటాం

మలుపుల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుం టాం. రోడ్లను పరిశీలించి రేడి యం స్టిక్కర్లు సూచికలు లేని చోట వెంటనే ఏర్పాటు చేయి స్తాం. శిథిలమైన కల్వర్టులను మళ్లీ నిర్మించడానికి ఆదేశాలు జారీ చేస్తాం. ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసు కుంటాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తేకొంతమేరకు ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుంది.

ప్రభాకర్, డీఈఈ(దేవరకొండ)

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యం



తూర్పుపల్లి నుంచి కొమ్మేపల్లి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముం దుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని తూర్పుపల్లి నుంచి కొమ్మేపల్లి వరకు రూ.2.70 కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు, మహబూబ్‌నగర్ జిల్లా జాతీయ రహదారి నుంచి డౌరాజీతండా వరకు రూ.1.60 కోట్లతో నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తూర్పుపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్‌నాయిని జమునామాధవరెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, వడ్త్య దేవేందర్‌నాయక్, పల్లా నర్సింహ రెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, జూలూరి ధనలక్ష్మీబాలనారాయణ గౌడ్, శిరందాసు కృష్ణయ్య, ఎంపీడీవో డానియెల్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణ శివారులోని మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం ఆయనపూజలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యే బాలునాయక్‌ను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయకమిటి నిర్వాహకులు గాజుల అంజనేయులు, కాశీనాథ్, ఇడెం రామకృష్ణ, మల్లయ్య, పున్న వెంకటేశ్వర్లు, వనం యాదయ్య, శిరందాసు కృష్ణయ్య, సిరాజ్ ఖాన్, పల్లా నర్సింహరెడ్డి, వనం చంద్రమౌళి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



పీఏపల్లి మండలం గణపురంలో ధాన్యం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. పీఏపల్లి మండలం గణపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతులు అప్పులు చేసి పండించి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కాలయాపన చేయకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపట్ల లేదని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, మునగాల అంజిరెడ్డి, నర్సింహ, యాదగిరి, సుధాకర్, మహేందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాయిని నర్సింహరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ : దివంగత మాజీ హోం మంత్రి నాయిని నర్సింహరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం నాయిని నర్సింహరెడ్డి జయంతిని పురస్కరించుకొని దేవరకొండలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల అంజనేయులు, ముక్కమళ్ల బాలయ్య, ఆరేకంటి రాములు, బొడ్డుపల్లి కృష్ణ, పల్లా లోహిత్‌రెడ్డి, ఇద్దయ్య, రిజ్వాన్, జానిబాబా, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తిరునాళ్లు



దామరచర్ల సిరిమానోత్సవం ఊరేగింపు

దామరచర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తిరునాళ్లను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మేలో పంటలు ఇంటికి చేరిన తరువాత తిరునాళ్లను రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. సోమవారం సిరిమానును అలంకరించి గ్రామ పురఃవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దుకాణా వెలిశాయి. ముత్యాలమ్మ తిరునాళ్ల సందర్భంగా సిరిమానోత్సవానికి సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు ప్రతేక పూజలు చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

హాలియా,మే 12(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని స్వయం భూ వేంకటేశ్వర స్వామి ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూ దేవి సమేత వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం భగవారాధన, సేవాకాలం, తీర్థగోష్టి అనంతరం స్వామివారి కళ్యాణం నిర్వహించి మహా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధుల్లో స్వామి వారి శోభయాత్రను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో డప్పు వాయిద్యాలు నడుమనిర్వహించారు. అలాగే మంగళవారం భగవారాధన, తీర్థప్రసాద గోష్టి, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, మహాకుంభప్రోక్షణ, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కుందూరు వెంకటరెడ్డి, పీత వెంకటేశ్వరరాజు, చవ్వాకుల రాజు, తిరుపతి నాయుడు, భాగ్య, సరస్వతి, స్వాతి, అరుణ, వరలక్ష్మి, పురోహితులు రాఘవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..



విత్తనాలు సేకరిస్తున్న యువకులు (ఫైల్)



సేకరించిన విత్తనాలు

» వనజీవి రామయ్య స్ఫూర్తితో విత్తనాలు సేకరిస్తున్న మిర్యాలగూడ యువకులు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విత్తనాలు సేకరించి, చల్లి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు మిర్యాలగూడ పట్టణానికి చెందిన యువకులు. దివంగత వనజీవి రామయ్య స్ఫూర్తితో గతేడాది విత్తన సేకరణ చేపట్టగా ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

వనజీవి రామయ్య స్ఫూర్తితో చేపట్టిన విత్తన సేకరణ కార్యక్రమాన్ని రెండో ఏడాది కొనసాగిస్తున్నారు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ యువకులు. పట్టణంలో గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికుడు అవిరెండ్ల సందీప్ ఆధ్వర్యంలో అత ని మిత్రులు దైద పవన్, ఉబ్బపల్లి రాజేష్, కందికంటి సైదులు, దైద సాయినాథ్, కందికంటి రమేష్, అవిరెం డ్లఅజయ్, ఆర్.సైదులు గతేడాది మూడు లక్షల విత్తనాలను సేకరించారు. వర్షాకాలంలో ఆవిత్తనాలను ని యోజకవర్గ వ్యాప్తంగా చల్లితే అందులో పావు శాతం విత్తనాలు మొలకెత్తినా తమ కృషి ఫలిస్తుందంటున్నారు.


మొక్కలంటే మక్కువ

మునిసిపల్ పారిశుధ్య కార్మికుడిగా పట్టణ పరిశుభ్రతలో భాగస్వామి అయిన అవిరెండ్ల సందీప్‌కుమార్ వనజీవి రామయ్య స్ఫూర్తితో విత్తన సేకరణ చేపట్టాడు. మిత్రబృందంతో కలిసి గతేడాది మూడు లక్షల విత్తనాలను సేకరించిన సందీప్ ఈ వేసవిలో రెండు లక్షల విత్తనాలను సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు.

ఏఏ విత్తనాలంటే..

మనం రోజు తిరిగే దారుల్లో, సేదతీరే చెట్ల కిందే విత్తనాలు అందుబాటులో ఉంటాయంటున్నారు గాం ధీనగర్ యువకులు. గానుగ, వేప, అల్బిజియా, నేరే డు, చింత, మర్రి, రాగి, సీతాఫలం, మామిడి విత్తనాలను అతి సులభంగా సేకరించొచ్చంటున్నారు. సేకరించిన విత్తనాలను దామరచర్ల, మిర్యాలగూడ మండలాల్లో అధికంగా చల్లారు. వీటిలో 25 నుంచి 35 శాతం వరకు మొలకెత్తినట్లు వారు తెలిపారు.

ప్రకృతి రక్షణ అందరి బాధ్యత



ప్రకృతిని రక్షించేందుకు అందరూ ముందుకు కదలాలి. పెరుగుతున్న భూ తాపం మానవాళితో పాటు సమస్త జీవరాశులపై ప్రభావం చూపుతోంది. ప్రకృతిని రక్షించుకోవాలంటే పచ్చదనాన్ని పెంచాలి. మిత్రులందరం కలిసి గత వేసవిలో 3 లక్షల విత్తనాలు సేకరిం చాం. సీజన్‌లోనూ విత్తన సేకరణ మొదలుపెట్టాం. వర్షాకాలంలో ఆ విత్తనాలు చల్లుతాం.

- అవిరెండ్ల సందీప్‌కుమార్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

మిర్యాలగూడ రూరల్, దామచరచర్ల మే 12(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 15న బాలురు, 16న బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట మిర్యాలగూడ దామరచర్ల గురుకులాల కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.లక్ష్మయ్య, బి.జానునాయక్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మిర్యాలగూడ మండలం అవంతీపురంలోని గురుకుల ప్రతిభా కళాశాలలో ఉదయం 11గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి పాసైనా విద్యార్థులు మార్కుల మె మో, స్టడీ కండక్ట్, కుల, ఆదాయ, ఆధార్, స్పోర్ట్స్, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలతో పాటు మూడు కలర్ ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

దేవరకొండలో ముందస్తు అరెస్ట్

దేవరకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్ పర్యటనకు వస్తున్న అడ్డుకుంటారనే సమాచారం మేరకు దేవరకొండలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నేతలను సోమవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్, ఏబీవీపీ జిల్లా హస్టల్స్ ఇంచార్జ్ గోపిచంద్ మాట్లాడుతూ అక్రమంగా అరెస్ట్‌లు చేయడం సరి కాదన్నారు. అందాల పోటీల పేరుతో ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని విమర్శించారు. అరెస్టయినవారిలో ఎస్ఎఫ్ఐ, సీపీఎం నేతలు యాదగిరి, బిజిలి లింగయ్య, వెంకటరమణ, మల్లేష్, కందుకూరు శ్రీను ఉన్నారు.

లారీ ఢీ కొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని లారీ ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామం వద్ద మిర్యాలగూడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. త్రిపురారం మండలం కంపాలపల్లి గ్రామానికి చెందిన నాగవెల్లి రా ములు(80) చెన్నాయిపాలెం గ్రామంలోని తన మనుమరాలు ఇంటికి వెళ్లేందుకు తుంగపాడు వద్ద ఆటోనుంచి దిగి రోడ్డుదాటుతున్నాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలు కావడతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. లారీని అతివేగంగా అజాగ్రత్తతో నడిపి వృద్ధుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతుడి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ ..

నిడమనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తెలిసిన వివరాల ప్ర కారం. గ్రామానికి చెందిన ఓర్సు నాగలక్ష్మి(33) చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో బంధువులు పెంచి పెళ్లి చేశారు. కానీ భర్త కూడా ఆమెను వదిలేయడంతో కొడుకుతో కలిసి గ్రామంలోనే ఉంటూ, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తుంది. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. కానీ సోమవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె మరణానికి కారణాలు తెలియనప్పటికీ రెండు ఆపరేషన్లు చేయడంతోనే మృతి చెందినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాగా మహిళ మృతిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.